వినూత్న ఆవిష్కరణలు... ఆలోచింప చేసే ఎగ్జిబిట్లు.. సరికొత్త ఆలోచనలతో సందడి చేసే సాంకేతికోత్సవం ఉత్సాహంగా ప్రారంభమైంది. వరంగల్‌లోని నిట్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థుల సమక్షంలో చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి రోజు ఈవెంట్లతో విద్యార్థులు అదరగొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు వారి యువ మేధోమథనానికి అద్దం పట్టాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు స్వాగతం పలికాయి. మొత్తంగా విద్యార్థి క్లబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. ముఖ్యంగా వాహన ప్రదర్శన, బాంబ్ అవే, నియాన్ క్రికెట్, గ్రీటింగ్ రోబో, వీఆర్ స్పేస్ టూర్, కార్ రేస్, లైడిక్టర్ ఈవెంట్‌లు ఆకట్టుకున్నాయి. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీంతో నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



ఆవిష్కరణలే హద్దుగా..

నిట్‌లో ఘనంగా ప్రారంభమైన

టెక్నోజియాన్-25

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత
- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

7



క్వాడ్ బాక్స్ ఈవెంట్



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హద్దులను చెరిపేసుకో..

అలాగే పరిమితులనూ తెలుసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయాల కోసం శ్రమించు..
- నిర్భయంగా ఉండు.. నిగ్గదీసి అడుగు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే దాన్ని తీసుకొస్తుంది
- నిట్ నాకు జీవితాన్ని, జీవిత భాగస్వామిని ఇచ్చింది..
- చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

7

సీసీఐ కేంద్రాల్లో విక్రయించి

మద్దతు ధర పొందాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని ఓబుల్ కేశవపూర్‌లో శ్రీ వెంకటేశ్వర కాటన్ ఇండస్ట్రీస్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.8,110 మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జిన్నింగ్ మిల్లులు ఎంపిక చేసుకొని బుకింగ్ చేసుకున్న తేది ప్రకారం తేమ శాతం లేకుండా సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ నందు ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి నరేందర్, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌బనుక శివరాజ్ యాదవ్, పాల్గొన్నారు.

పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి

పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలంలోని పెంబర్తిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి. సిలబస్ ఎంతవరకు పూర్తి అయిందో తెలుసుకొని విద్యార్థులు ఎలా ప్రిపేర్ అవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులు ప్రత్యేక కార్యాచరణ పెట్టుకొని ఇప్పటి నుంచే పరీక్షలకు ప్రిపేర్ కావాలని ఏ ఒక్క రోజు సమయం వృథా చేయకూడదన్నారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

గత పాలకుల పాలనలో అభివృద్ధి శూన్యం

- 15 ఏళ్ల నష్టాన్ని పూరించడానికే వెంటపడి నిధులు తెస్తున్నా..
- రెండేళ్ల కాలంలో నియోజకవర్గానికి రూ.1388 కోట్ల నిధులు తీసుకువచ్చా
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల పాలనలో అభివృద్ధి శూన్యమని, 15ఏళ్లలో జరిగిన నష్టాన్ని పూరించడానికి ప్రభుత్వం వెంటపడి నిధులు తీసుకువస్తున్నానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలో రోడ్ల వైడనింగ్, అభివృద్ధికి గాను రూ.331.80కోట్లు మంజూరు చేయడంపై సీఎం చిత్రపటానికి నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 5566.15 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి రూ 10,547. 38 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో మొదటి విడతలోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో 8 రోడ్లు, 91.55 కిలోమీటర్ల అభివృద్ధికి గాను రూ 171.82కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజక వర్గంలోని ఏడు మండలాల పరిధిలోని 23 పంచాయతీరాజ్ హ్యామ్ రోడ్లు మొత్తం 141.11 కిలోమీటర్లకు రూ 140 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ట్రైబల్ వేల్ఫేర్ నుంచి నియోజకవర్గంలోని 13 రోడ్లకు రూ 20 కోట్ల నిధులు మంజూర య్యాయని వెల్లడించారు. ఇన్ని నిధులు తీసుకువస్తున్న కొందరు పనిలేని పసలేని పనికిరాని వాళ్ల విమర్శలు చేస్తున్నారని, వాళ్ల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను నాశనం చేసిందని, ముందు వాళ్ల కుటుంబాన్ని చక్కదిద్దుకున్న తరువాత మా పైన విమర్శలు చేయాలని హితవుపలికారు. మంత్రి కొండా సురేఖ సమస్య సమసి పోయిందని, మాట్లాడడానికి ఏమీ లేదన్నారు.

30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడు రౌడీయిజం, భూ కబ్జాలు, అవినీతికి పాల్పడలేదన్నారు. అభివృద్ధిలో తనతో పోటీ పడలేకనే తనపైన కొందరు విమర్శలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు, చిలుపూర్ ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, జగదీష్‌చందర్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, అంబటి కిషన్‌రాజు, మంద రాజు, రాజేష్‌నాయక్, తెల్లాకుల రామక్రిష్ణ, మంచాల ఎల్లయ్య, నీల గట్టయ్య, లింగాజీ, రజాక్‌యాదవ్, యాదగిరి, గడ్డమీది సురేష్, గుర్రపు ప్రసాద్, బొడ్డు సమ్మయ్య, దిలీప్‌రెడ్డి, జీడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఛాగల్లులో చోరీ

రూ.3 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల చోరీ

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఛాగల్లులో చోరీ జరిగిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోట రమాదేవి తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 23న సాయంత్రం తన తల్లిగారింటికి దీపావళి నోములకు వెళ్లారు. రాత్రి అక్కడే ఉన్నారు. కాగా శుక్రవారం రమాదేవి ఇంటితాళం పగులగొట్టి ఉండడం, తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి ఇంటి పక్కవాళ్లు రమాదేవికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బాధితులు వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్ రూమ్‌లో బీరువాలోని చిన్న ఆల్మర తెరిచి చూడగా మూడున్నర తులాల బంగారం, 8 తులాల వెండి ఆభరణాలు లేవు. ఇంట్లో చొరబడిన గుర్తు తెలి యని దొంగలు ఎత్తుకెళ్లినట్లు తెలి పారు. వాటి విలువ సుమారు 3 లక్షల వరకు ఉంటుం దని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. రమాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జి.వేణు తెలిపారు.

తీరనున్న కరెంటు కష్టాలు

- లో వోల్టేజీ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే కడియం ఫోకస్
- పలు గ్రామాలకు సబ్ స్టేషన్ల మంజూరు

6



రక్తదానం చేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటాం..

- సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

వరంగల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతలను పరిరక్షించడమే కాదు.. సేవా కార్యక్రమాలు చేయడంలోనూ పోలీసులు ముందు వరుసలో ఉంటారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా సీపీ రక్తదానం చేసి యువతలో స్ఫూర్తిని రగిలించారు. పోలీస్ అధికారులతో పాటు యువత, ఆటోడ్రైవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్‌రెడ్డి, ఆర్ఐలు, హనుమకొండ రెడ్‌క్రాస్‌బ్లడ్ బ్యాంకు ప్రతినిధులతో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు పాల్గొన్నారు.

మహా జాతరకు నిరంతర విద్యుత్

- 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సరఫరా
- 911 పోల్స్‌తో 61.17 కి.మీ. కొత్త లైన్లు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా మరమ్మతు పనులు
- మేడారంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల వెల్లడి



మేడారంలో విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా చర్యలు చేపట్టడం జరిగిందని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు మధుసూదన్, మోహన్‌రావులు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను శుక్రవారం వారు పరిశీలించారు. మహా జాతరకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ఏర్పాట్ల వివరాలను చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ మల్హార్ నాయక్‌లను అడిగి తెలుకున్నారు. మేడారంలో కనురెప్ప పాటు విద్యుత్ అసౌర్యం కలుగవద్దని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను నోటీసులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం మాట్లాడుతూ మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. 911 పోల్స్‌తో 61.17 కిలోమీటర్ల నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జాతరలో 350 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.ముఖ్యంగా ప్రమాదాలుజరుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయాలు కలుగకుండా ఉండేందుకు పస్రా, కమలాపూర్ 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి మూడు 33 కేవీలైన్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. పస్రా, కమలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి తాడ్వాయి మీదుగా మేడారంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. అదేవిధంగా పస్రా నుంచి కొత్తూరు సబ్‌స్టేషన్‌కు, నార్లాపూర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈక్రమంలోనే మేడారం పరిసరాల్లో విద్యుత్ మరమ్మతు ఏర్పాట్లను తిరిగి పరిశీలించడం జరిగిందన్నారు. అంతేకాకుండా అధికారులకు పలు సూచనలు చేసినట్లు వారు పేర్కొన్నారు. స్థానిక డీఈ నాగేశ్వరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ సదానందం, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

● నేల వాలిన వరి ● దెబ్బతిన్న పత్తి, మిర్చి పంటలు

కాటారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం తేలికపాటి వర్షం కురియగా సాయంత్రం ఒక్కసారిగా గాలితో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చెట్ల కొమ్మలు విరిగిపడగా, పలువురి ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. హఠాత్తుగా కురిసిన గాలివానతో కాటారం మండల వ్యాప్తంగా పలువురు రైతులకు చెందిన వరి, పత్తి, మిర్చి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. గాలివానతో పలుచోట్ల వరి వెన్నులు, పత్తి మొక్కలు నేల వాలాయి. పంటల ఆఖరి దశలో గాలివానతో దెబ్బతినడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని భూడిదపల్లి, విలాసాగర్, దేవరాంపల్లి, రేగులగూడెం, ధన్వాడ, గంగారం, శంకరంపల్లి, చింతకాని, గోపాల్‌పూర్, గూడూరు, కొత్తపల్లి, కాటారం, గారెపల్లి, దామెరకుంట తదితర ప్రాంతాల్లో పాలుపోసుకునే దశ నుంచి మొదలుకుని గింజలు అయిన వరి, ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి పంటలు దెబ్బతిన్నాయి. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిసి ముద్దయింది.

వరి నేలవాలి నీళ్లలో పడటంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని పలు గ్రామాల రైతులు లక్ష్మారెడ్డి, రవి, రాజేష్, సమ్మయ్య, శంకర్, అప్జల్ రాజేందర్, గట్టయ్య, రాజయ్య, బాపు ఆవేదన వ్యక్తం చేశారు. చాలా చోట్ల ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి పంట వర్షంతో రంగు మారి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. గాలి వానకు పత్తి చెట్లు సైతం నేల వాలాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాలివాన బీభత్సంతో నష్టపోయిన తమకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



చింతకానిలో నీటమునిగిన మిర్చి పంట



దేవరాంపల్లిలో నేల వాలిన వరి పంట

మండలంలో భారీ వర్షం

మల్హర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యూర్, కుంభంపల్లి, వల్లెంకుంటతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు భారీ వర్షం పడింది. ఇప్పటికే వరి పొలాలు కోత దశకు రాగా వర్షం వల్ల వడ్లు రాలిపోతాయని రైతులు తెలుపుతున్నారు. ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. వర్షం వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి నవీన్

వరిపంటలను పరిశీలించిన అధికారులు

వెంకటాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తారం గ్రామ శివారులో గల వరి పంటలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నవీన్ పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. రెండు నెలలుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరి కంకికి నల్లి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించడం జరిగిందని అన్నారు. దాని నివారణకు స్పైరోమిషన్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ సంబంధిత సూచనలు, సలహాలకు వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో జాయిన్ అయితే సమయానికి అనుకూలంగా రైతులకు పంటల తెగుళ్లు, చీడపీడలపై సూచనలు, సలహాలు అందిస్తారని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకన్య, రైతులు పాల్గొన్నారు.

మండలంలో పర్యటించిన అధికారులు



పంకెనలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై తెలుసుకుంటున్న అధికారులు

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పలిమెల, మహదేవపూర్ మండలాల్లో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అనంతరం పలిమెల మండలంలోని లెంకలగడ్డ పాఠశాలతో పాటు పంకెనలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను సంయుక్తంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వారి వెంట పంచాయతీరాజ్ అధికారులు తదితరుల ఉన్నారు.

కాళేశ్వరాలయంలో లక్ష వత్తుల పూజలు



ఉసిరిక చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

మహదేవపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరాలయంలో శుక్రవారం లక్ష వత్తుల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. బిల్వ పత్ర పూజలు, కృత్తికా మాస పూజలు నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టు వద్ద చేపట్టిన కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూసేకరణను వేగంగా పూర్తిచేయాలి

● చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాధాన్యత కలిగినది ● సమీక్షలో కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం మొదటి, రెండవ దశలకు భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, మెగా ఇంజనీరింగ్, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు చాలా ప్రాధాన్యత కలిగినదని అన్నారు. ప్రాజెక్టును పూర్తి చేయడంలో భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు, మ్యూటేషన్ ప్రక్రియలు, పరిహారం చెల్లింపులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రాజెక్టు పనుల్లో ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులకు పరిహారం సకాలంలో అందేలా పునరావాస కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు పురోగతిపై ప్రతివారం సమీక్షలు నిర్వహించి ప్రగతిని అప్‌డేట్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్, సర్వే ల్యాండ్ ఏడీ కుసుమకుమారి, ఇరిగేషన్, మెగా కంపెనీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్

కార్మికులకు అండగా బిల్డింగ్ వర్కర్స్ ఫెడరేషన్

బచ్చన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికులకు బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జోగు ప్రకాశ్, తాండ్ర ఆనందంలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జిల్లా కోశాధికారి అన్నెబోయిన రాజు అధ్యక్షతన జరిగిన రెండో మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. నిరంతరం కార్మికుల పక్షాన పనిచేసే సీఐటీయూ అనుబంధ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కార్మికులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా సంఘం మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మానేపల్లి బిక్షపతి, కార్యద ర్శి మధు, ఉపాధ్యక్షులు సుధాకర్, సహాయ కార్యదర్శి చంద్రయ్య, సభ్యులుగా రవి, భూమయ్య, కిష్టయ్య, స్వామి తదితరులను ఎన్నుకున్నారు.

ఏఎన్‌ఎంల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్

● ఐటీడీఏ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

ఏటూరునాగారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, పీఎంహెచ్‌లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ హాస్టల్ ఏఎన్ఎంలకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ ఎస్వో రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలలుగా వేతనాలు అందక గిరిజన హాస్టళ్లలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంల కుటుంబాలు పూట గడవని దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకమ్మ, దీపావళి పండుగలకు కూడా వారికి డబ్బులు అందలేదన్నారు. బడ్జెట్ విడుదలై రెండు నెలలు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు వేతనాలు చెల్లించడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగా త్వరగా జీతాలు వేసేలా చూస్తానని చెప్పినా ఇప్పటివరకు చెల్లించలేదని తెలిపారు. అంతేకాకుండా పండుగ సెలవులు, ఆదివారాలకు కూడా అధికారులు జీతం కట్ చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. వెంటనే పూర్తి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ ఏఎన్‌ఎంలకు ప్రసూతి సెలవులు, మెడికల్ కిట్స్ కూడా అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, ఏఎన్‌ఎంలు స్వరూప, శాంతకుమారి, గీతాంజలి, అరుణ, సుజాత, కల్పన, రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎస్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఏఎన్‌ఎంలు

బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేశ్‌లాల్‌పల్లికి చెందిన బాదావత్ మన్విత్ గతంలో తండ్రి మరణించగా, ఇటీవల తల్లి బాదావత్ అనిత మృతి చెందడంతో అనాథ అయ్యాడు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ బాలుడిని ఓదార్చి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశాడు. బాలుడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి.చాంద్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి అంగోత్ వంశీ, జిల్లా నాయకులు లక్కీ, గూడెపు రాకేష్, శంకర్, గోవర్ధన్, రమేష్, సాంబయ్య పాల్గొన్నారు.

ఆకాశంలో డబుల్ ధమాకా..!

ఒకేసారి వరసగా అలరించిన ఇంద్రధనస్సులు

కాటారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా వినీలాకాశంలో తెల్లని మబ్బులు తప్ప ఏమి కనిపించని పరిస్థితి ఉండగా శుక్రవారం చూపరులకు సింగిడీలతో డబుల్ ధమాకా కానవచ్చింది. మధ్యాహ్నం ఆకాశంలో రెండు వరసలుగా పూర్తి స్థాయిలో ఇంద్రధనస్సులు కనిపించి కనువిందు చేశాయి. హఠాత్తుగా కురిసిన కొద్దిపాటి వర్షం అనంతరం తొలిసారిగా సప్తవర్ణ మాలికలు ఆకాశంలో చోటు చేసుకోవడంతో పలువురు ప్రకృతి ప్రేమికులు ఆనంద పరవశులయ్యారు.మరోవైపు సింగిడి(ఇంద్రధనస్సు)లు ఏర్పడడంతో వర్షాలు ఇక కురియవని కొంత మంది ప్రజలు అభిప్రాయపడ్డారు.



ఆకాశంలో రెండు వరసలుగా కనిపిస్తున్న ఇంద్రధనస్సులు

తీరనున్న కరెంటు కష్టాలు

లో వోల్టేజీ సమస్య పరిష్కారంపై ఎమ్మెల్యే కడియం ఫోకస్

పలు గ్రామాలకు సబ్‌స్టేషన్ల మంజూరు


చిలుపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్ళుగా లో వోల్టేజీ విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు త్వరలో విముక్తి లభించనుంది. అందులో భాగంగా ఇప్పటికే ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని చిలుపూర్, రఘునాధపల్లి, జఫర్‌ఘఢ్ మండలాల్లోని కొండాపూర్, కుర్చపల్లి, సాగరం గ్రామాల్లో రూ 7. 50 కోట్లతో (ఒక్కొక్కటి రూ 2. 50 కోట్లు) 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇటీవలే వాటికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం వాటి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఒక్కో సబ్‌స్టేషన్ పరిధిలో నాలుగు ఫీడర్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యుత్ సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరో వైపు చిలుపూర్ మండలంలో లింగంపల్లి, పల్లగుట్ట, నష్కల్ గ్రామాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లను నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

లింగంపల్లి, పల్లగుట్టతో పాటు, రఘునాధపల్లి మండలంలోని ఫతేషాపూర్, పాలకుర్తి మండ లంలోని మల్లంపల్లి, ముత్తారం టెండర్లు పూర్తయినట్లు అధికారుల ద్వారా తెలిసింది. నూతనంగా నిర్మించే కొండాపూర్ సబ్‌స్టేషన్‌తో కొండా పూర్ టౌన్, కొండాపూర్ ఏజీఎల్, కొమ్ముగుట్టతో పాటు, లింగంపల్లి గ్రామాలకు ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేయనున్నారు. వీటన్నింటికీ సమానంగా విద్యుత్‌ను అందించేందుకు 5 ఎంఏ సామర్థ్యం కలిగిన రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను సబ్‌స్టేషన్లో బిగించనున్నారు. ఫీడర్ల నిర్మాణం కోసం అవసరమైన పోల్స్ (స్థంభాలు)ను ఆయా మార్గాల్లో బిగించేందుకు సన్నాహాలు చేపడుతున్నారు. దీంతో పరిసర ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండాపూర్‌లో శరవేగంగా సాగుతున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

లో వోల్టేజీని అధిగమించేందుకే కొత్త సబ్‌స్టేషన్లు



కొత్తగా ఏర్పాటు చేసే సబ్‌స్టేషన్లతో లో వోల్టే జీ సమస్యను అధిగమిస్తాం. కొండాపూర్, కుర్చ పల్లి, సాగరం సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు, త్వరలో మరి కొన్ని ప్రాంతాల్లో 33/11 కేవీ, వడ్లకొండ, చిన్నమడూర్‌లో 220/132ల కోసం స్థల సేకరణ పూర్తయింది. అదే విధంగా జనగామలోని చంపక్‌హిల్స్‌లో 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించేందుకు ఇప్పటి కే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

- వేణుమాధవ్, ఎస్‌ఈ ఎన్పీడీసీఎల్, జనగామ

ఏజెన్సీలో ముమ్మర తనిఖీలు

ప్రశాంతంగా మావోయిస్టుల బంద్

వాజేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలమైన వాజేడులో శుక్రవారం వాజేడు, పేరూరు పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టులు ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. మావోయిస్టుల బంద్‌తో పోలీసులు మన్యంలో అలర్ట్ అయ్యారు. ప్రధాన రహదారులు, వంతెనలను క్షుణ్ణంగా సోదా చేశారు. బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. బంద్ నేపథ్యంలో అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు వినియోగిస్తున్న భారీ వాహనాలను వాజేడు, పేరూరు పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. కొన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు సైతం రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తనిఖీల్లో పోలీసులు ప్రయాణికుల బ్యాగులను, వారి వివరాలను సేకరించారు.

● ఏటూరునాగారం(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దండకారణ్యంలో చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న మావోయిస్టు పార్టీ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. కాగా, శుక్రవారం ఇచ్చిన భారత్ బంద్ ఏజెన్సీలో ప్రశాంతంగా ముగిసింది. ములుగు జిల్లాలోని తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల బంద్ పిలుపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏటూరునాగారం అడిషనల్ ఎస్పీ శివం ఉపాధ్యాయ, సీఐ అనుముల శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు నిఘా పెంచి తనిఖీలు ముమ్మరం చేశారు. బంద్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని సరిహద్దు ప్రాంతాలలో పోలీసు బలగాలను పెంచారు.



చెరుకూరు-ధర్మవరం మధ్యలో రహదారిపై పోలీసుల తనిఖీలు

బిట్స్ పాఠశాల ఎదుట ఆందోళనలు

కృష్ణకాలనీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిట్స్ పాఠశాల ఎదుట ఆందోళన కొనసాగింది. ఈ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థులపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడన్న ఆరోపణలపై పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఆ పాఠశాల ఎదుట వేర్వేరుగా తెలుగుదేశం పార్టీ నేతలు, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నేతలు, ఎస్ఎఫ్ఐ నేతలు ఆందోళనలు చేపట్టారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారి ఆందోళనను విరమింపజేసి బలవంతంగా ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో ఆయా పార్టీలు, సంఘాల నేతలు ఎస్పీకే సాగర్, రవి పటేల్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6905	5300
మక్కలు	1925	1521
కందులు	6122	3022
పెసళ్లు	4122	3022
పల్లికాయ (సూక)	4000	3500
పల్లికాయ (పచ్చిది)	4600	3420
పసుపు (కాడి)	10958	8699
పసుపు (గోల)	10157	8906
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16100	12000
యూఎస్341ఏసీ	15500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



వాహన ప్రదర్శన

నిట్ విద్యార్థులు స్వయంగా డిజైన్ చేసి తయారు చేసిన రెండు వాహనాలు- క్వాడ్ బైక్, ఎఫ్-1 విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత స్వయంగా సందర్శించారు. వాటి గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ వాహనాలు అన్ని అడ్డంకులను అధిగమించి వేగంగా దూసుకుపోతాయి.

సాంకేతికోత్సవం షురూ

- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- వినూత్న ఆవిష్కరణలు.. ఆలోచింప చేసే ఎగ్జిబిట్లు
- నిట్ క్యాంపస్‌లో ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రపంచలోనే అత్యంత ఎత్తైన చినాబ్ వంతెన నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన బెంగుళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించగా స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్, స్టూడెంట్ అక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ప్రొఫెసర్ యు.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి ఈవెంట్లు

ట్రెకో హంట్, రాకెట్, మర్డర్ మిస్టరీ, డీఆడిట్, ఆప్టీమిస్టరీ, నోబగ్స్, లైట్ పెయింటింగ్, మోషన్ కాప్చర్, స్కైస్కాట్, మెక్ కిట్, బ్లేంజ్, ఆఫ్ ట్రాక్ ఆర్సీ, ప్రాజెక్టు ఎక్స్‌పో, మొబైల్ జో, షార్క్, లాంచ్ ప్యాడ్, ఎర్త్, డస్కటిల్ డౌన్, ట్రాక్ ట్రివియా, ఎస్‌డీసీ గేమ్స్, స్వాప్ స్టాప్, బాంబ్స్ అవే, మోడల్ మేనియా, నియాన్ క్రికెట్, స్టాక్ ఫిషర్, గెస్చర్ డ్రిఫ్ట్, ప్రాజెక్ట్ షోకేస్, మెటల్యూజన్.

నవ ఆవిష్కరణల వేదిక

టెక్నోజియాన్-2025 నూతన సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు, నిర్వహిస్తున్న వారి యువ మేథోమథనానికి అద్దం పడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణకు స్వాగతం పలుకుతున్నాయి. మొదటి రోజు విద్యార్థి క్లబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం విద్యార్థులంతా ఈవెంట్ల నిర్వహణలో బిజీ అయిపోయారు.

నియాన్ క్రికెట్



చీకటి గదిలో నియాన్ బ్యాట్లు, బంతులు, స్టంప్‌తో నిర్వహించే నిర్వహించే ఆసక్తికరమైన క్రికెట్ ఈవెంట్ ఇది. గత టెక్నోజియాన్‌లోనూ దీనిని నిర్వహించారు. నియాన్ క్రికెట్ ఆడటానికి విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపారు.



వీఆర్ స్పేస్ టూర్

టెక్నోజియాన్‌లో మరో హైలైట్ ఈవెంట్ వీఆ ర్ స్పేస్ టూర్. కళ్లజోడులాగా ఉండే ఒక పరికరాన్ని ధరించి అందులో నుంచి త్రీడీ పింటర్ సహాయంతో అంతరిక్షంలోని అద్భు తాలను వీక్షించవచ్చు. అంతేకాకుండా దీని ని ధరించి ఆర్చరీ, ఇతరత్రా గేమ్స్‌ను కూ డా ఆడవచ్చు.

ఇతర ఈవెంట్లు

వీటితోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించిన గేమింగ్, కోడింగ్ మారథాన్ అయిన ది బ్లేజ్ ఈవెంట్ పాల్గొనేవారి ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించింది. షార్క్ ట్యాంక్ 2.0 అనే ఈవెంట్ కొత్త ఆవిష్కర్తలు, ఎంట్రప్రెన్యూవర్లు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల సమక్షంలో ప్రదర్శించిన పోటీ. రాకెట్ డిజైన్ అండ్ లాంచ్ (లాంచ్ ప్యాడ్) ఈవెంట్ ద్వారా విద్యార్థులు రూపొందించిన మోడల్ రాకెట్లను విజయవంతంగా ప్రయోగించి, వైమానిక గుణకాలు, ప్రొపల్షన్ సూత్రాలను ప్రదర్శించింది. స్వాప్ స్టాప్ అనే ఈవెంట్ సృజనాత్మకత, ఫుడ్ సైన్స్ కలయికతో ఐస్ క్రీమ్ తాయారీ పోటీ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రేపింది. మెటల్యూషన్, భూకంప నిరోధక భవన రూపల్పన, కౌన్ బనేగా సివిల్ ఇంజనీర్, జెశ్చర్ డ్రిఫ్ట్ కార్ రేస్, కోడ్ రెడ్, మ్యూటాడార్ట్ మెకానికల్ కిట్ అసెంబ్లీ తదితర ఈవెంట్లు టెక్నోజియాన్‌లో హైలైట్‌గా నిలిచాయి.

ఈ సారి టెక్నోజియాన్‌లో బాంబ్ అవే ఎగ్జిబిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిట్ విద్యార్థులు కేవలం రెండు రోజుల వ్యవధిలో దీనిని రూపొందించారు. రిమోట్‌తో ఎగిరే ఈ విమానం నుంచి నిర్దేశిత లక్షిత ప్రదేశంలో గురి తప్పకుండా బాంబులు వేయగలుగుతుంది. క్యాంపస్‌లో దీనిని ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపారు. విద్యార్థులను ఇది విశేషంగా ఆకట్టుకున్నది.



బాంబ్ అవే..

కార్ రేస్ ఈవెంట్

ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఒక రూట్‌ను ఏర్పాటు చేసి వీటి మధ్యలో నుంచి రోబోరేస్ కార్లను రిమోట్ కంట్రోల్ సహాయంతో నడపాలి. రూట్‌లో నిర్ణీత మార్గంలో ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవాలి. మధ్యలో ఎత్తుపల్లాలను చాకచక్యంగా అధిగమించాలి.



హద్దులను చెరిపేసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయం కోసం శ్రమించు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే గుర్తింపునిస్తుంది..
- చినాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగం



టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలో కెల్లా అత్యంత ఎత్తైన వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవీలత మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నంతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని అన్నారు. నిర్ణీత లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని అన్నారు. అదే సమయంలో మన పరిమితులు ఏమిటో తెలుసుకోవాలన్నారు. అపజయాలకు ఎవరూ వెరవద్దన్నారు. జీవితంలో ప్రతీఒక్కరు ఎప్పుడో ఏదో ఒక సందర్భంలో ఫెయిల్ అవుతుంటారని, అంత మాత్రాన భయపడి పోయి వెనకడుగు వేస్తే ఏదీ సాధించలేమన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. గుర్తింపు కోసం వెంటపర్లాడరాదన్నారు. ఐడెంటిటీ క్రైసిస్ వల్ల జీవితంలో మనం అనుకున్నది సాధించలేమన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పనిచేసుకుంటూ పోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందన్నారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ఈసీలో (ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడు పాకులాడలేదన్నారు. చెనాబ్ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలు పెట్టారన్నారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని అన్నారు. తాము ఎక్కడ చదువుకున్నా, ఎక్కడ ఉద్యోగం చేసినా నిజాయితీగా మన ధర్మాన్ని నెరవేర్చినప్పుడు గుర్తింపు దానంతట అదే వస్తుందన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వవిద్యార్థిగా ఇప్పటివరకు పేరు నమోదు చేసుకోలేదని, చెనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలు మార్లు అలుమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందన్నారు. అలుమ్ని అవార్డును కూడా ప్రదానం చేయనున్నట్టు ప్రకటించిందన్నారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. తాను ఎంటెక్ విద్యార్థిగా ఉన్నప్పుడు తన పురోగతికి సహకరించిన ఆనాటి అధ్యాపకులందరినీ పేరు పేరునా గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు వారు అందించిన జ్ఞానం, జీవితం పట్ల కల్పించిన దృక్పథం తన ఉన్నతికి ఎంతో దోహదం చేసిందన్నారు. వరంగల్ నిట్ తనకు జీవితంతో పాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్ (మెకానికల్) చేశాడని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. టెక్నోజియాన్ విద్యారుల నవ ఆవిష్కరణల సమాహారం అన్నారు. సృజనాత్మకతకు వేదికగా అభివర్ణించారు. ఆలోచనలు పరస్పర పంచుకోవడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో అద్భుతాలను సాధించవచ్చునన్నారు. అందుకు టెక్నోజియాన్ వంటివి ఎంతో దోహదపడుతాయన్నారు. సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న టెక్నోజియాన్ ఉద్దేశ్యాన్ని వివరించారు. సృజనాత్మకత, సహకారం, సాంకేతిక ప్రతిభను పెంపొందించడం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఉమెన్ ఇన్‌టెక్ ఫోరం, జాతీయస్థాయి బ్లేజ్ గేమింగ్ అండ్ కోడింగ్ మారథాన్ వంటి ఈవెంట్లు విద్యార్థులు మేధాశక్తికి మరింత పదును పెడతాయన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. 2006లో ప్రారంభమైన టెక్నోజియాన్.. ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద సాంకేతికోత్సవాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ఈ ఏడు సుమారు 7వేల మంది విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల నుంచి మరో వెయ్యి పాల్గొంటున్న ఈ టెక్నోజియాన్ జాతీయ స్థాయిలో తన ప్రభావాన్ని మరింతగా ప్రతిబింబిస్తోందన్నారు. ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ టెక్నోజియాన్ బృందం చూపిన నిబద్ధతను ప్రశంసించారు. తొలుత టెక్నోజియాన్-2025 అధికారిక వీడియోను, గత ఎడిషన్ల ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు.



టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

చినాబ్ వంతెన ఓ అద్భుతం

అనంతరం ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనపై ప్రొఫెసర్ జి.మాధవీలత వైజ్ఞానిక ప్రసంగం చేశారు. ఈ వంతెన నిర్మాణంలో తన 17 ఏళ్ల అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. చినాబ్ వంతెన, రూపకల్పన, నిర్మాణం గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 359 మీటర్ల ఎత్తులో చెనాబ్ నదిపైన నిర్మించడంతో జమ్ముకశ్మీర్ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు వంతెన నిర్మాణంలో ఎదురైన సవాళ్లను వివరించారు. చెనాబ్ నిర్మాణం సందర్భంగా ఇంజనీరింగ్ దృఢత్వం, సృజనాత్మకత, సంక్లిష్టసమస్యల పరిష్కారం, సమన్వయం ప్రాముఖ్యతను వివరించారు. రూపకల్పనలో కచ్చితత్వం, స్థలస్థాయి నిర్ణయాలు, బృంధ సమన్వయం- ఈమూడు అంశాల కలయికతోనే ఈ మహా ప్రాజెక్టు విజయవంతమైందని ప్రొఫెసర్ మాధవీలత పేర్కొన్నారు.

గ్రీటింగ్ రోబో

టెక్నోజియాన్‌లో విశేషంగా ఆకట్టుకుంటు న్న మరో ఎగ్జిబిట్ గ్రీటింగ్ రోబో. ఎవరైనా దీని దగ్గరికి వెళితే హాయ్.. అంటూ పలకరిస్తుంది. చేతిలో ట్రేతో ముందుకు, వెనకకు కదులుతూ ఉంటుంది. దీనిని సాధారణంగా ఆయా వేడుకల్లో అతిథు లను స్వాగతించేందుకు ఉపయోగించేలా రుద్రాక్షి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని రూపొందించారు.



లైడిటెక్టర్

లైడిటెక్టర్ ఈవెంట్ కూడా టెక్నోజియాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. చర్మప్రతి స్పందన (స్వేదం) ఆధారంగా సమాధానాల నిజాయితీని కొలిచే వినూత్న సాంకేతిక ఆవిష్కరణ.



విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు
- కేయూలో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న అప్పారావు

కేయూక్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నున్నా అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఐక్యతను దెబ్బతీస్తూ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగంల్లో ముందుంటే మన దేశం కులమత విద్వేషాలతో రగులుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందన్నారు. ఏటేటా లక్ష ఉద్యోగాల హామీ నేరవేరడం లేదని ధ్వజమెత్తారు. మత, కుల రాజకీయాలను అడ్డుకుని తిప్పికొట్టాలని అన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధి ఎజెండాతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రకటించారు. అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఆదర్శ్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రంజిత్, సహాయ కార్యదర్శులుగా బిక్షిత్‌రెడ్డి, డ్యానియల్, కోశాధికారిగా ముషారఫ్, సభ్యులుగా ఆదిత్య, ఈశ్వర్, సాయి, యుగేందర్, పృథ్వీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్రనేత సుత్రాపు అనిల్, కీర్తి, సాయి, మానస, ఆదిత్య, రఘురాం, రఘువరన్, శివసాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం

- టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకుమార్ యాదవ్



టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ తదితరులు

హనుమకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం చేస్తామని టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండలో శారద ఫంక్షన్ హాల్‌లో టీఆర్‌పీ జిల్లా నియోజక వర్గ కన్వీనర్లు, కో కన్వీనర్ల నియామకంపై టీఆర్‌పీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రజినీకుమార్ యాదవ్ మాట్లాడారు.

రాబోయే వంద రోజుల్లో బహుజనుల ఢంకా తెలంగాణ అంతటా మోగిపోతుందని అన్నారు. బహుజన రాజ్యమే టీఆర్‌పీ సంకల్పమని అన్నారు. మేమెంతో మాకంత.. నినాదంతోనే టీఆర్‌పీ పార్టీ ఏర్పడిందన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో టీఆర్‌పీ జెండా గద్దె నిర్మించి జెండా ఎగురవేసి బహుజన ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్తామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల నియోజకవర్గ కన్వీనర్ల నియామకం కోసం ముఖ్య నాయకులతో చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతం రవి పటేల్, ఇనుకాల ప్రణయ్, సామల చంద్రశేఖర్, పిట్టల వెంకటేశ్, జినుకు శ్రీనివాస్, సామల శ్రీలత, బత్తిని వెంకటేశ్ గౌడ్, మాదం నరేష్ యాదవ్, గండి వెంకటేశ్వర్ గౌడ్, పూజారి సత్యనారాయణ, గుగ్గిరాజు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఊకల్ గుడిలో నాగుల చవితికి ఏర్పాట్లు

గీసుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలోని ఊకల్‌లో గల ప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించే నాగుల చవితి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏటా నాగుల చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఎంతో మహిమాన్వితత్వం ఇక్కడి నాగేంద్రుడిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అంతేకాకుండా స్వామి దీక్షలు చేపట్టిన స్వాములు నాగబంధ కావడులతో ఊరేగింపుగా తరలివచ్చి మాల విరమణలు చేస్తారు. దీంతో ఆలయం భక్తుల సందడిగా మారుతుంది. కాగా, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావులు తెలిపారు.



బంతి పూల అలంకరణలో నాగేంద్రుడు (ఫైల్)

పత్తికి విపత్తు

- పెట్టుబడులు రాక రైతులు దిగాలు
- వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు



నారాయణతండాలో ఎర్రబడిన పత్తి పంట

దుగ్గొండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో వరసగా వర్షాలు కురియగా రైతులు సాగు చేసిన పత్తి పంటతో తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్ల దాడి, భారీ వర్షాలు వారిని కోలుకోకుండా చేశాయి. వానలు వరసగా కురియగా పత్తి పంట ఎర్రబడి పెరుగుదల లోపించి, పంట దిగుబడి తగ్గింది. ఎకరం సాగు చేస్తే 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశపడిన రైతులకు 4 క్వింటాళ్ల దిగుబడి రాని పరస్థితి ఏర్పడింది.

డివిజన్‌లో 58,612 ఎకరాల పత్తి పంట సాగు

నర్సంపేట డివిజన్‌లో 58,612 ఎకరాలలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. చెన్నారావుపేట మండలంలో 10,618, ఖానాపురంలో 8,113, దుగ్గొండిలో 12,639, నల్లబెల్లిలో 11,457 ఎకరాలు, నెక్కొండలో 13,137 ఎకరాలు,నర్సంపేటలో 8,138 ఎకరాలు పత్తి పంటను రైతులు సాగు చేశారు. డివిజన్‌లో సాగు చేసిన పంటకు 4,68,898 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని ఆశించినా, అందులో సగం దిగుబడి రాని పరస్థతి ఉంది. రైతులు గత్యంతరం లేక పత్తి పంటను తొలగించి దాని స్థానంలో ఇతర పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

వరసగా వానలు, తెగుళ్ల దాడి

జూలై నెలలో సాగు చేసిన నెల రోజుల తర్వాత నుంచి వరసగా వానలు కురియగా, ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా భారీ వర్షాలు పడడంతో పంట ఎదుగుదల లేకపోవడంతో పాటు పంట ఎర్రబడి పోవడం, వివిధ రకాల తెగుళ్ల సోకడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొదటి పంట ఏరగానే పత్తి పంట ఎర్రబడిపోయింది. గతంలో పత్తి పంటను నాలుగు ధపాలుగా ఏరేవారు. ఇపుడు ఒక్కసారి ఏరుతూనే పంట ఎర్రబడిపోతుంది. దీంతో రైతులు సాగు చేసిన పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇష్టపడుతున్నారు.. పత్తి పంట సాగు చేసిన భూమిలో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

పంటకు గిట్టుబాటు ధర లేక..

పండిన కొద్దిపాటి పత్తిపంటకు సరైన ధరలేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పత్తి పంటకు క్వింటాల్‌కు రూ:14 వేలు గతంలో ధర పలికింది. తర్వాత రూ:10 వేలు ధర పలికింది. సీసీఐ ధర రూ:8110 నిర్ణయించగా నేడు మార్కెట్లో రూ:7000 వరకు ఉంది. నాణ్యత పేరుతో రూ: 6600 మాత్రమే ధర పలుకుతుంది. సాగు చేసిన పంటకు పెట్టుబడి సైతం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గింది

పాలడుగుల చంద్రమౌళి, రైతు, తిమ్మంపేట



గత ఏడాది తెగుళ్ల, అధిక వర్షాలతో పంటలు, పత్తి పంట దెబ్బతిని నష్ట పోగా ఈ ఏడాది కూడా భారీ వర్షాలతో పత్తి పంట నష్టపోయాం ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా వానలు పడడంతో సాగు చేసిన 4 ఎకరాలలో పత్తి పంట దెబ్బతింది. కొద్ది పాటి పంట రాగ దానిని మొదటి సారి ఏరగానే పంట ఎర్రబడింది. ఎకరానికి రూ:20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా, ఎకరానికి 2 క్వింటాళ్ల దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల ముందుగానే పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధమవుతున్నాం.

వరుసగా కురిసిన వర్షాలతో పత్తి పంటకు నష్టం

నరహరి కృష్ణారెడ్డి, రైతు తిమ్మంపేట



ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరసగా కురిసిన వర్షాలతో మూడు ఎకరాలు సాగు చేయగా పత్తి పంట దెబ్బతిని దిగుబడి రాలేదు. పంట ఎదుగుదల లేక పోవడంతో పాటు పంట ఎర్రబడింది. పండిన పంటను కూలీలను పెట్టి ఎర్రగా విచ్చిన దిగుబడి పెట్టుబడులు రాక , కూలీల కూలీ రేటు రాని పరస్థితి ఉంది. సుమారుగా రూ:60 వేలు పెట్టుబడి పెట్టగా రూ:20 వేలు కూడ రాని పరస్థితి ఉంది. ఎకరం పంటకు 3 క్వింటాళ్లు రాని దుస్థితి ఏర్పడింది. రైతుకు మిగిలింది అప్పు మాత్రమే. పండించిన పంటకు గుట్టుబాటు ధర కల్పించాలి.

ఇప్పగూడెంవాసులకు తప్పని ఇక్కట్లు

● బురదమయంగా కాలనీలు.. పట్టింపులేని పాలకులు.. ● గృహ సముదాయాల మధ్య నిలిచిన మురుగునీళ్లు ● ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలు


ఇప్పగూడెం రెండో వార్డులో గృహ సముదాయాల మధ్య నిలిచిన మురుగునీళ్లు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామం రాజకీయంగా ఎంతో చైతన్యవంతమైన గ్రామమైనప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనకంజలో ఉంది. అందుకు నిదర్శనం గ్రామంలోని పలు వీధుల్లోని రోడ్ల దుస్థితే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గ్రామంలోని 1, 2, 3వ వార్డుల్లోని పలు రోడ్లు పూర్తిగా బురదకూపంగా మారి అటుగా వెళ్లే వారు కాలుతీసి కాలుపెట్టే పరిస్థితి లేకుండా పోయింది. గ్రామంలోని పాత బస్టాండ్ నుంచి రంగరాయ గూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. గుంతల్లో నీరుచేరడంతో రోడ్డు మీదుగా నడిచే వాళ్లు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2వ వార్డులోని గృహ సముదాయాల మధ్య నెలకొన్న బురదకూపం కుంటను తలపిస్తోంది. దీంతో చుట్టు పక్కల గృహాల వారు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు, అనేక రోజులుగా నీళ్లు నిల్వగా మారి ఉండడంతో దుర్గంధం వస్తుందని సమీప గృహాలకు చెందిన వారు వాపోతున్నారు. గ్రామంలోని కొత్త బస్టాండ్ నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లే రోడ్డు పైన మోకాలు లోతు బురద ఏర్పడడంతో వాహనదారులు రోడ్డుమీదుగా వెళ్లేందుకు నరకయాతన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకొని రోడ్ల అభివృద్ధి పైన, గృహ సముదాయాల మధ్య నిలిచిన నీళ్లు తొలగించే చర్యలు చేపట్టేలా దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


పోస్టాఫీసు సమీపంలో రోడ్డు పైన ఏర్పడిన గుంతలు

అభివృద్ధి నిధులు మంజూరు చేయాలి


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు తదితరులు

చిలుపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. పలు గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు నేతృత్వంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం సమస్యలను విన్నవించారు. తొలి విడతగా ప్రతీ గ్రామానికి రూ 50 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మాజీ జడ్పీటీసీ స్వామినాయక్, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు రూప్లానాయక్, ఎన్నకూస కుమార్, సాదం నర్సింహులు, జీడి ఆనందం, డైరెక్టర్లు రత్నాకర్‌రెడ్డి, పేరాల సుధాకర్, వెంకటేశ్వర్లు, ఇల్లందుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు అలవాటు కావొద్దు


కళా బృందం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

పాలకుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై దూలం పవన్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని తిర్మలగిరిలో పోలీస్ జాగృతి కళా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో ప్రజలకు సైబర్ నేరాలు, మూడ నమ్మకాలు, మత్తు పదార్థాలపై ప్రజలు, యువత దూరంగా ఉండాలని సూచించారు. షీ టీం కోసం డయల్ 100 చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు మూడనమ్మకాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాగమణి, విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య పూల్‌సింగ్, శీకనివాస్, నారాయణ, విక్రమ్, రాజు, చిరంజీవి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి చెక్కు ఇస్తున్న పూర్వ విద్యార్థులు

చిలుపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆరెల్లి రమేష్ (40) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని అతనితో కలిసి 1999 -2000ల సంవత్సరంలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎలిశాల విద్యాసాగర్, కండ్లకోలు నాగరాజు, విజయ్, రాజు శుక్రవారం సందర్శించారు. రమేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం స్నేహితులందరి సహకారంతో సేకరించిన రూ 45 వేల మొత్తాన్ని పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్టు చేశారు. అట్టి పత్రాలను రమేష్‌కు సతీమణి రవళికి అందించారు. రమణారెడ్డి, సంపత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలి

రఘునాథపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయిం చాలని జనగామ పశుసంవర్ధక శాఖ ఏడీఏ రంజిత్ అన్నారు. మండలంలోని వెల్ది గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం జనగామ ఏడీఏ రంజిత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎస్.కె.అసిఫా తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

జనగామ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన బనుక బాలరాజ్ అనే వ్యక్తి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కిరణ్ కుమార్ మానవతా దృక్పథంతో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పదించిన మంత్రి చికిత్స కోసం కావల్సిన రూ.3 లక్షల ఎల్‌వోసిని మంజూరు చేయించారు. కిరణ్ కుమార్ ఎల్‌వోసి పత్రాన్ని శుక్రవారం బాలరాజ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం ఎల్‌వోసి పత్రాలను అందజేసి వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గణిపాక మహేందర్, సర్వల నర్సింగరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న నాగపురి కిరణ్ కుమార్

మార్కెట్‌లో దీపావళి లక్ష్మీ పూజలు


పూజలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్ శివరాజ్‌యాదవ్

జనగామ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం దీపావళి లక్ష్మీ పూజను ఘనంగా నిర్వహించి అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివరాజ్ యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జీవన్ కుమార్, వైస్ చైర్మన్ కొల్లూరి నరసింహులు, డైరెక్టర్లు బానోతు బన్సి నాయక్, నామాల శ్రీనివాస్, నాగబండి రవీందర్, ఎండీ భాష్మియా బంథ కుమార్, పర్ష సిద్దేశ్, వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత


ఎన్‌ఆర్‌ఐలతో ఉపాధ్యాయులు, యునిఫాంలో విద్యార్థులు

రఘునాథపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమల్ల హైస్కూల్ విద్యార్థులకు ఇదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ ఐలు శ్రావణి, అరుణ్ రుద్ర, అయేషా సుల్తానా టీ-షర్టుల తో పాటు ప్యాంటులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.నర్సింహులు, ధారణ సత్యప్ర కాష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, వేణుమాధవ్, స్వప్న, సురేష్, షహీన్ తబస్, సుస్మిత, ఆలం, రమ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్ ..


విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ వివరాలు, సెక్షన్లను వివరిస్తున్న సీఐ అబ్బయ్య

నర్మెట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నర్మెట పోలీస్‌స్టేషన్‌లో సీఐ అబ్బయ్య ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధులు, రిసెప్షన్, లాకప్, క్రైమ్ ఫైల్స్, తుపాకుల రకాలు, వినియోగం, వివిధ చట్టాలపై నర్మెట సీఐ అబ్బయ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్‌స్టేషన్‌ను విద్యార్థులు తీక్షణంగా పరిశీలించి మంచి అనుభవంగా భావించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్.నగేష్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్డుల అందజేత

నర్మెట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్షేమ హస్టళ్లు, మోడల్‌స్కూల్, కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు దిక్సూచి కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. దిక్సూచి ఆరోగ్యకార్డులను అందిస్తున్నట్లు నర్మెట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం హెల్త్ స్క్రీనింగ్ చేయిస్తుందని అందులో భాగంగానే మండలకేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 217 మంది విద్యార్థినీలకు, మోడల్ స్కూల్‌లో 66 మంది విద్యార్థులకు, మాన్‌సింగ్ తండాలోని కస్తూర్బా పాఠశాలలో 227 మంది విద్యార్థినీలకు, తరిగొప్పుల మండలంలోని కస్తూర్బా పాఠశాలలో 175 మంది విద్యార్థినీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి దిక్సూచి ఆరోగ్య కార్డులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సుకన్య, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రశాంత, మమత, సుల్తానా, తేజస్విని, ఏఎన్‌ఎంలు సుల్తానా, కరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సదస్సును జయప్రదం చేయాలి

జనగామ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనగామలో నేడు నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో- కన్వీనర్ భూక్య చందు నాయక్ పిలుపునిచ్చారు. సంఘ జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అధ్యక్షతన శుక్రవారం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేయగా చందు నాయక్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత పత్తి ధరలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, సీసీఐ, మార్కెట్ కమిటీలు, ప్రభుత్వ నిర్ణయాలలో స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని, పత్తి ధర క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ. 10,075 నిర్ణయించాలని, పత్తిని ఎక్కడైనా, ఎవరికైనా విక్రయించే అవకాశం కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేడు జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్లో నిర్వహించే పత్తి రైతుల రాష్ట్ర సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపనిచ్చారు. కార్యక్రమంలో మీట్యా నాయక్, మంగ బీరయ్య, ఉర్సుల కుమార్, మాచర్ల సారయ్య, బోడ రాములు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న భూక్య చందు నాయక్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


ఇబ్రహీంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాంబాబు

రఘునాథపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు దళారుల బారిన పడి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశానుసారం రఘునాథపల్లి, ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్, లక్ష్మీతండాలో ఐకేపీ ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబుతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బామమియా, పర్శ సిద్దేశ్, నాయకులు గాదె మహేందర్ రెడ్డి, లోనే శ్రావణ్ కుమార్, హయత్ ఆలీ, కడారి రవి, చిన్ననగేష్, పోకల శ్రీనివాస్,చింత హరీష్, యాకుబ్, నరేష్, కాసర్ల లక్ష్మయ్య, ఐకేపి ఏపీఎం ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల : తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తోందని ఆయా గ్రామాల్లో వక్తలు అన్నారు. శుక్రవారం మండలంలోని దేవునిగుట్ట తండా, లకావత్ తండా, ధర్మపురం, కడవెండి, గొల్లపల్లి, మన్‌పహడ్, సీతారాంపురం, కొత్తవాడ, రాంబోజిగూడెం, నీర్మల, రాంరాజుపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రైతులు ధాన్యం అమ్ముకోవటంలో ఇబ్బంధులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఈ సీజన్‌లో గతంలో కంటే ముందుగానే సెంటర్‌లు ప్రారంభించటం జరుగుతోందన్నారు. ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుని నష్టపోరాదని, కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాల న్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.


దేవరుప్పులలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఐడీవోసీ వద్ద యూబీఐ సేవలు

జనగామ రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనగామ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఐడీవోసీ వద్ద యూనియన్ బ్యాంకు యూబీఐ సేవలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో బిజినెస్ కరస్పాండెంట్ ద్వారా అన్ని గ్రామాల్లో మారుమూల ప్రజలకు బ్యాంకు సేవలను అందించాలన్నారు. జనగామ జిల్లా అభివృద్ధిలో భాగంగా బ్యాంకులు ఆక్టీవ్‌గా పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియాన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్, ఏజీఎం శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలపై పోరాటం

బచ్చన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతు సమస్యలపై పోరాటం చేస్తామని, నేడు (శనివారం)జనగామలో జరిగే పత్తి రైతుల సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రైతుసంఘం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్ తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ పత్తి అమ్ముకోవానుకునే రైతులకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని చెప్పడం సరికాదన్నారు. గ్రామాల్లో రైతులకు స్మార్ట్ ఫోన్‌లు తక్కువగా వినియోగిస్తారని తెలిపారు. ఇప్పటి వరకు పత్తి కొనుగోళ్లను సీసీఐ ద్వారా ప్రారంభించలేదన్నారు. రైతుల సమస్యలు పట్టించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు మినలాపురం ఎల్లయ్య, రైతులు రవి, మల్లయ్య, స్వామి, భూమయ్య, కిష్టయ్య, చంద్రయ్య, అశోక్ తది తరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో చోరీ

రఘునాథపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రఘునాథపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. మండల కేంద్రంలోని బచ్చు వేణుగోపాల్, బచ్చు మురళీకృష్ణ అనే ఇద్దరు అన్నదమ్ములు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదుతో పాటు మూడు తులాల వెండి అభరణాలను దొంగిలించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం తిరిగి వచ్చిన వేణు, మురళీకృష్ణకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశారు. దొంగతనం జరిగినట్లు తెలి సింది. ఇదే రాత్రి మండల కేంద్రంలో ఇంటి ముందు పార్కు చేసి ఉన్న పాశం బన్నీకి చెందిన బైక్ సైతం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

లింగాలఘణపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందారం గ్రామానికి చెందిన ముప్పిడి మల్లేశం(42)అనే వ్యక్తి పురుగుల మందుతాగి చికిత్సపొందుతూ శుక్రవారంమృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుందారంకు చెందిన మల్లేశం కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుండగా కుటుంబపోషణ కోసం అప్పుల పాలయ్యాడు. దీంతో ఈనెల 20న పురుగుల మందుతాగి ఆత్మహత్యాహత్నానికి పాల్పడగా వెంటనే గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమత్తం జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించగా చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య సుమలత ఇద్దరు కుమార్తెలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆలకుంట్ల కనకరాజు (30) అనే వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందిన సం ఘటన మండలంలోని మీదికొండలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మీదికొండ గ్రామ పరిధిలోని వడ్డెరగూడెంకు చెందిన ఆలకుంట్ల కనకరాజు తాగుడుకు బానిసై ఏ పని చేయకుంటా తిరుగుతున్నాడు. తెలిసిన వాళ్ల వద్ద అప్పులు చేసి మద్యానికి ఖర్చు పెట్టడంతో అప్పులు పెరిగాయి. అప్పులు ఇచ్చిన వాళ్లు తరచుగా నిలదీ యడంతో పాటు, కుటుంబ సభ్యులకు మద్యం బంద్ చేసి ఏదైనా పనిచేసి కుటుంబానికి అండగా ఉండాలని మందలించడంతో జీవితంపై విరక్తి చెందిన కనకరాజు ఈ నెల 23న ఇంటి వెనుకాలకు వెళ్లి గడ్డిమందు తాగాడు. అనంతరం ఇంట్లో వారికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 18 నెలల కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బచ్చన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సీనియర్ జర్నలిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జనగామలో ఓ దినపత్రికలో పనిచేస్తున్న మారగోని సిద్ధయ్యగౌడ్ ఈ నెల 19న వృత్తి పనిపై జనగామ నుంచి చేర్యాల వైపు వెళుతున్నాడు. ఆలీంపూర్ సమీపంలోకి రాగానే కుక్క అడ్డురావడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న సిద్ధయ్యగౌడ్ ఎగిరి కింద పడ్డాడు. దీంతో పక్కటెముకలు విరిగిపోయాయి. జనగామలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

సోమన్న ఆలయంలో కొబ్బరి చిప్పల వేలం

పాలకుర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం కొబ్బరి చిప్పల వేలం నిర్వహించగా రూ. 5,41,116 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో మోహన్‌బాబు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ బోనగిరి ఇన్‌స్పెక్టర్ అఖిల్ పర్యవేక్షణలో సీల్ టెండర్‌కు నిర్వహించిన వేలం పాటలో జఫర్‌గడ్‌కు చెందిన తాటికాయల ఎల్లయ్య కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం రూ. 5,41,116 లక్షలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నాడని తెలిపారు. గత ఏడాది రూ. 39,116 వేలు ఆదాయం కంటే ఎక్కువ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ఎర్రబెల్లి

దేవరుప్పుల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెం దిన బస్వ సావిత్రి-మల్లేశ్ దంపతుల కూ తురు నిశ్చితార్థ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం పాల్గొన్నారు. కాబోయే దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పల్లా సుందర్ రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్, గాంధీనాయక్, సోమసుందర్, రవి, ప్రవీణ్, అర్జున్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు